సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



చీనీ @ రూ.23 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 15 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.9.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/15.4°
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా



అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 28న (శనివారం) ఉదయం 10.30 గంటలకు స్థానిక కోర్టురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. అమరరాజాగ్రూప్, ఫ్లిప్‌కార్ట్, ఎస్ఎస్ మ్యాన్‌పవర్ సెక్యూరిటీ సర్వీసెస్, వైభవ్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర కంపెనీల్లో మిషన్ ఆపరేటర్, డెలివరీ ఎగ్జిక్యూటివ్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన యువత అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనం ఉంటుందని తెలిపారు.

నేడు ఓడీచెరువులో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఏవైనా సమస్యలపై అర్జీల రూపంలో అందిస్తే పరిష్కరిస్తామన్నారు. మండల కేంద్రంలోని పుట్టపర్తి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. అర్జీలు ఇచ్చే వారు అందులో ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌ను నమోదు చేయాలన్నారు.

నాలుగు రైళ్లు తాత్కాలిక రద్దు



అనంతపురం సిటీ: అనంతపురం మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే నాలుగు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మవరం–మచిలీపట్నం మధ్య నడిచే రైలు(నంబర్: 17216) గురువారం నుంచి నవంబర్ 3వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. మచిలీపట్నం–ధర్మవరం మధ్య నడిచే రైలు (నంబర్: 17215) వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. యశ్వంత్‌పూర్–మచిలీపట్నం మధ్య తిరిగే రైలు(నంబర్:17212) ఈ నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు రద్దు చేయగా, మచిలీపట్నం–యశ్వంత్‌పూర్ మధ్య నడిచే రైలు(నంబర్: 17211)ను నవంబర్ ఒకటో తేదీ(ఒక్క రోజు మాత్రమే) రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్ తెలిపారు. ప్రయాణికులు ఆయా తేదీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు.

రేపు లేపాక్షి ఆలయం మూసివేత



లేపాక్షి: చంద్రగ్రహణం సందర్భంగా పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయాన్ని ఈనెల 28న మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయం మూసి వేస్తున్నామన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 7 గంటలకు ఆలయ శుద్ధి సంప్రోక్షణ అనంతరం యథావిధిగా భక్తులకు దర్శనాలు కల్పించడం జరుగుతుందన్నారు. లేపాక్షి ఆలయానికి విచ్చేసే భక్తులు, పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

28న కసాపురం ఆలయం మూసివేత

గుంతకల్లు రూరల్: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 28న కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం అనంతరం 29వ తేదీ ఉదయం 6.30 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

విషాద పయనం



ఆగివున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టిన టాటా సుమో



ప్రమాదస్థలిలో మృతదేహాలు

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- 13 మంది దుర్మరణం
- 10 మంది జిల్లావాసుల మృత్యువాత
- మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు
- దసరా ఉత్సవాలు ముగించుకుని వెళ్తుండగా విషాదం

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: వారంతా కూలీలు. జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని బెంగళూరు వెళ్లారు. దసరా నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చారు. ఎంతో సంతోషంగా ఊరిలో గడిపారు. పండుగ ముగియడంతో మళ్లీ కూలి పనుల కోసం నగరానికి బయలుదేరారు. ఇంకొంత దూరం వెళ్తే గమ్యస్థానానికి చేరే వారే. అయితే, ఊహించని రీతిలో సంభవించిన ప్రమాదం వారి ప్రాణాలు కబళించింది. బంధువులను దుఃఖసాగరంలోకి నెట్టింది. కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ సమీపంలో గురువారం రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను టాటా సుమో ఢీకొన్న ఘటనలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో గోరంట్ల, ఓడీ చెరువు మండలాలకు చెందిన వారు ఆరుగురు, పెనుకొండకు చెందిన వారు ఇద్దరు, చిలమత్తూరు, కొత్తచెరువు మండలాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. అందులో ముగ్గురు మహిళలు, ఓ బాలుడు ఉండడం గమనార్హం.

ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి

పెనుకొండ: రోడ్డు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన చిక్కబళ్లాపురం తరలివెళ్లారు. ఆస్పత్రి వద్ద మృతుల బంధువులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

తల్లితో పాటే కుమారుడు..



శాంతమ్మ



రాజవర్ధన్

రోడ్డు ప్రమాదంలో పెనుకొండ మండలం గోనిపేటకు చెందిన శాంతమ్మతో (37), ఆమె కుమారుడు రాజవర్ధన్ (16) దుర్మరణం పాలయ్యారు. ప్రస్తుతం వీరు గోరంట్ల మండలం కాటేపల్లిలో నివాసం ఉంటున్నారు. గోనిపేట గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నా పంటలు పెట్టుకోలేక బెంగళూరులో పనులు చేసుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. భర్త శంకరప్ప వ్యసనాలకు బానిసైనా పట్టుదలతో శాంతమ్మ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేదని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

చెల్లి సీమంతానికి వచ్చి వెళ్తుండగా..



అరుణ (ఫైల్)

గోరంట్ల చౌడేశ్వరీ కాలనీకి చెందిన మల్లికార్జున కుమార్తె అరుణ (38), ఆమె ఏడేళ్ల కుమారుడు రుత్విక్‌లు ప్రమాదంలో కన్నుమూశారు. చెల్లెలు రాజేశ్వరి సీమంతం వేడుకల్లో పాల్గొనేందుకు నాలుగు రోజుల క్రితం అరుణ, కుమారుడితో కలిసి వచ్చింది. ఎంతో ఆనందంగా గడిపిన ఆమె తిరిగి బెంగళూరు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. అరుణ భర్త బెంగళూరులో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది.

ముంబై నుంచి వచ్చి..



నారాయణప్ప

ఓడీ చెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్పకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు ఉండగా, ఒక కుమారుడు ముంబైలో ఉంటున్నాడు. చిన్న కుమారుడు బెంగుళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ముంబైలో పెద్ద కుమారుడి వద్ద ఉంటున్న నారాయణప్ప దసరా పండుగకు స్వగ్రామం మలకవారిపల్లికి వచ్చాడు. గురువారం బెంగుళూరులో ఉన్న చిన్న కుమారుడిని చూసేందుకు బయలుదేరాడు. అనుకోని ప్రమాదం ఆయన ప్రాణాలు బలిగొంది.

రెండేళ్ల క్రితమే వివాహం.. 6 నెలల కుమారుడు



పవన్‌కుమార్ (ఫైల్)

కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన పవన్‌కుమార్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. డిగ్రీ పూర్తి చేసిన పవన్ బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం తనకల్లు మండలం ఈతోడు గ్రామానికి సంధ్యతో వివాహం జరిగింది. 6 నెలల కుమారుడు కూడా ఉన్నాడు. భార్య పుట్టినింట్లో ఉంది. పండుగ నేపథ్యంలో ఈతోడు వచ్చాడు. గురువారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేందుకు వెళ్తూ ప్రాణాలు కోల్పోయాడు. భర్త మరణ వార్త తెలుసుకున్న సంధ్య గుండెలవిసేలా రోదించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

చావులోనూ ఒక్కటిగా..



వెంకటాద్రి, లక్ష్మి (ఫైల్)

గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి (27), బోయ లక్ష్మి (23) కి రెండేళ్ల క్రితం పెళ్లి జరిగింఇ. ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. వెంకట్రాద్రి బెంగళూరులో పెయింటింగ్ పనులకు వెళ్లేవాడు. ఆయన భార్య లక్ష్మి గార్మెంట్స్‌లో పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. 3 రోజుల క్రితం దసరా పండగతో పాటు సమీప బంధువులకు చెందిన ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు సొంతూరు వచ్చారు. తిరిగి బెంగళూరు వెళ్లే క్రమంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల వారు కన్నీటిపర్యంతమయ్యారు.

కుమారుడి చదువుల కోసం బెంగుళూరుకు..



వెంకటనారాయణ, సుబ్బమ్మ (ఫైల్)

ఓడీ చెరువు మండలం నవాబుకోట గ్రామానికి చెందిన వెంకటనారాయణ, సుబ్బమ్మ దంపతులు. ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు రాజేష్ చదువుల నిమిత్తం బెంగళూరు వెళ్లారు. వెంకటనారాయణ అక్కడి ఓ ప్రైవేటు కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనికి కుదరగా, సుబ్బమ్మ అటెండర్‌గా పనిచేసేది. రాజేష్ అదే విద్యాలయంలో డిగ్రీ చదివేవాడు. పెద్ద కుమారుడు రాజశేఖర్ గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో మగ్గం పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. రాజేష్ ఇక్కడే ఉండిపోగా, దంపతులిద్దరూ బెంగళూరు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న కుమారులు కన్నీరుమున్నీరయ్యారు.

పెద్దదిక్కు మృతి..



నరసింహమూర్తి (ఫైల్)

ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో సుమో డ్రైవర్ నరసింహమూర్తి ఒకరు. ఈయనది గోరంట్ల మండలం కళ్లగేర గ్రామం. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్నంతలో కుటుంబం ఆనందంగా ఉండేది. అయితే, ప్రమాదంలో నరసింహమూర్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదిగా మారింది.

జగన్‌తోనే బడుగులకు మేలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పాల్గొన్న ప్రజాప్రతినిధులు



సభకు హాజరైన అశేష జనవాహిని

- ప్రభుత్వంలో అన్ని వర్గాలకు పెద్ద పీట
- సామాజిక సాధికారతను మాటల్లో చూపిన జగనన్న
- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- ఘనంగా ప్రారంభమైన సామాజిక సాధికార బస్సు యాత్ర
- తరలివచ్చిన ప్రజానీకం

బుక్కరాయసముద్రం: సీఎం వైఎస్ జగనన్నతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. 'సామాజిక సాధికారిక బస్సు యాత్ర'లో భాగంగా బీకేఎస్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషాశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాజారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అనంతపురం మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక రాష్ట్రం సస్యశ్యామలమైందన్నారు. చెరువులన్నింటినీ నీటితో నింపారన్నారు. శింగనమల చెరువు లోకలైజేషన్‌కు చొరవ చూపి ఇక్కడి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాలతో 76 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు మైనార్టీలు లబ్ధి పొందారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు చెప్పుకునేందుకు ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు.

అర్హత ఉంటే ఇంటికే 'సంక్షేమం'

ఎంపీ రంగయ్య మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. నేరుగా రూ. 2 లక్షల 38 వేల కోట్లను పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. పారదర్శకంగా పథకాలు అమలు చేశారన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే 'సంక్షేమం' చేరుతోందని తెలిపారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ జగనన్న విజయ యాత్రను ఎవరూ ఆపలేరన్నారు. బస్సు యత్ర చేపట్టిన చంద్రబాబు నేడు జైలు యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ పాదయాత్ర చేసి ఢిల్లీ యాత్ర చేశారని, పవన్ కళ్యాణ్ వారాహియాత్ర చేపట్టి పారిపోయే యాత్ర ప్రారంభిస్తున్నారని విమర్శించారు.

జనమే జనం..

- శింగనమలలో మధ్యాహ్నం 3 గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమైంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- శింగనమల నుంచి బుక్కరాయసముద్రం వరకూ సాగిన యాత్రలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
- తరలివచ్చిన జనంతో బుక్కరాయసముద్రం కిటకిటలాడింది.
- వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలన తెలియజేస్తూ సాగిన పాటలకు డ్యాన్సులు చేస్తూ పలువురు ఆకట్టుకున్నారు.
- డప్పు కళాకారుల నృత్యాలు అబ్బుర పరిచాయి.
- వాహన దారులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- తరలివచ్చిన ప్రజలకు తాగునీరు, భోజనాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలూరి రమణారెడ్డి ఏర్పాటు చేశారు.

'సాధికారత'ను తెలియజేసేందుకే యాత్ర..

గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్ద పీట వేసి సామాజిక సాధికారత అంటే ఏంటో సీఎం వైఎస్ జగన్ చేసి చూపారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. ముఖ్యమంత్రి చేసిన మంచిని వివరించేందుకే బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో కలిసి శింగనమలలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయంగా ఎంతో మందికి పదవులు ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్ద పీట వేశారన్నారు. మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబాపూలే అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక సాధికారత కల్పించారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నిరూపించారని ప్రశంసించారు. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్య పరిచేందుకే బస్సు యాత్ర చేపట్టామన్నారు. బాపట్ల ఎంపీ నందిగాం సురేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. సామాన్యులను సైతం పార్లమెంట్‌కు పంపిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని విమర్శించారు.

ప్రశాంతి నిలయాన్ని సందర్శించండి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించిన సత్యసాయి ట్రస్ట్ సభ్యులు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సత్యసాయి చిత్రపటాన్ని అందజేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ప్రశాంతి నిలయాన్ని సందర్శించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం న్యూఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, మనోహర్‌శెట్టి, సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఆమెకు సత్యసాయి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ ద్వారా విద్యార్థులకు చేస్తున్న మేలును వివరించారు. పైసా ఖర్చు లేకుండా సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ ప్రశాంతి గ్రాం, వైట్‌ఫీల్డ్ ద్వారా అందుతున్న సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని వివరించారు. స్పందించిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఒడిశా రాష్ట్రంలో జరుగుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాల్లో తాను స్వయంగా పాల్గొని పొందిన అనుభూతిని తెలిపారు. దేశీయంగా అమలు అవుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలపై తనకు అవగాహన ఉందని ట్రస్ట్ సభ్యులకు వివరించినట్లు వారు పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయాన్ని సందర్శించాలని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు రాష్ట్రపతిని ఆహ్వానించగా.. వీలైనంత త్వరగా సందర్శిస్తానని రాష్ట్రపతి తెలిపారని రేడియో సాయి ప్రతినిధులు తెలిపారు.

ప్రయాణికుల భద్రతే ధ్యేయం



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక బృందం అధికారులు

అనంతపురం సిటీ: రైల్వే ప్రయాణికులకు పూర్తి స్థాయి భద్రత కల్పించడంతో పాటు సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చడమే రైల్వే శాఖ ధ్యేయమని ప్రత్యేక బృందంలోని డిప్యూటీ చీఫ్ సేఫ్టీ అధికారి రవికుమార్, డిప్యూటీ సీఎస్‌ఓ నాగయ్య తెలిపారు. సిగ్నలింగ్ వ్యవస్థ లోపాల గుర్తింపునకు ప్రత్యేక బృందం గురువారం అనంతపురానికి చేరుకుంది. అనంతపురంలో సిగ్నలింగ్, ఆపరేటింగ్ వ్యవస్థలు సమర్థవంతంగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్, సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్, డీఎస్‌టీఈ శ్రీనివాసులు, ఏఓఎం లక్ష్మీనాయక్‌తో మాట్లాడారు. గూడ్స్, రైళ్లు వచ్చే రాకపోకల సమయంలో పైన పేర్కొన్న రెండు వ్యవస్థల పని తీరును పరిశీలించారు. ఈ రెండు వ్యవస్థలు సమర్థవంతంగా పని చేస్తే రైళ్ల ప్రమాదాలు దాదాపుగా ఉండవన్నారు. పైలెట్లు సిగ్నలింగ్ వ్యవస్థను అనుసరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.



28న వాల్మీకి జయంతి వేడుకలు

పుట్టపర్తి అర్బన్: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఈనెల 28న పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వాల్మీకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రాణాలు హరిస్తున్న పొగమంచు

- వేకువ జామునే దట్టంగా అలుముకుంటున్న వైనం
- చిక్కబళ్లాపురం ఘటనకు కారణం పొగమంచే

హిందూపురం అర్బన్: జిల్లాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కర్ణాటక ప్రాంతానికి ఆనుకుని ఉండడం కారణంగా హిందూపురం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతున్నాయి. దీంతోపాటు తేమ గాలులు ఎక్కువగా వీస్తుండడంతో పొగ మంచు కమ్మేస్తోందని వాతావరణ నిపుణులు అంటున్నారు. అయితే ఏటా మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలో పొగమంచు ప్రభావం ఆరంభంలోనే చేదు అనుభవాన్ని మిగిల్చింది. గురువారం వేకువజామున పొగమంచు కారణంగా చిక్కబళ్లాపురం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన 13 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండేళ్ల క్రితం కూడా పేరసంద్రం వద్ద జీపు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. రెండురోజుల క్రితం పొగమంచు కారణంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు కర్ణాటక సరిహద్దున ఆదెపల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం వీరు బెంగళూరులో చికిత్స పొందుతున్నారు.

దట్టంగా కురుస్తున్న పొగమంచు..

వారం రోజులుగా సూర్యోదయం కన్నా ముందు, సూర్యాస్తమయం తర్వాత చలి తీవ్రత బాగా పెరిగింది. ఈ ప్రభావంతో పొగమంచు దట్టంగా అలముకోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. హిందూపురం చుట్టుపక్కల పొగ మంచు ఈ సారి మరింత ఎక్కువగా ఉండే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి మొదటివారం వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఇప్పటికే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా వెళుతున్న వాహనాలను సైతం గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు వాహనాల హెడ్‌లైట్లను డ్రైవర్లు ఇష్టానుసారంగా మార్చడంతో పాటు డిజైన్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల పొగ మంచు ఏర్పడినప్పుడు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆర్‌టీఏ అధికారులు పేర్కొంటున్నారు.




పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనదారులు, పొగమంచులో హిందూపురం పట్టణం

పురంలో ఉష్ణోగ్రతలిలా..

తేదీ	పగటి వేళ	రాత్రి వేళ
22	29^0	19^0
23	29^0	18^0
24	28^0	18^0
25	27^0	17.8^0

జాగ్రత్తలు తప్పనిసరి



రాత్రి వేళ, వేకువ జామున రోడ్లపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పొగమంచు ఎక్కువగా ఉంటే వాహనాలు పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. హెడ్‌లైట్లను ఇష్టానుసారంగా మార్చడం ప్రమాదాలకు దారి తీస్తుంది. పొగమంచులో ప్రయాణించాల్సి వస్తే లోబీమ్ లైట్లను వాడాలి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనదారులకు మన వాహనం స్పష్టంగా కనిపిస్తుంది.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, హిందూపురం

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పెద్దిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: కర్ణాటకలోని చిక్కబళ్లాపురం వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గురువారం కలిశారు. చిక్కబళాపురం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ హుటాహుటినా అక్కడకు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన మంత్రి పెద్దిరెడ్డిని కలసి ప్రమాదం జరిగిన తీరు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, ముఖ్య నాయకులు జయశంకరరెడ్డి, వెంకటరత్నం, నీరుగంటి నరసింహమూర్తి, ట్రాక్టర్ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

కోడేకండ్ల వద్ద చిరుత సంచారం



కల్వర్టుపై కూర్చొన్న చిరుత

బత్తలపల్లి: మండలంలోని కోడేకండ్ల గ్రామ సమీపంలో చిరుత సంచారాన్ని స్థానికులు గుర్తించారు. గురువారం తెల్లవారుజామున కోడేకండ్ల–జ్వాలాపురం గ్రామాల మధ్య ఉన్న దుర్గమ్మ గుడి సమీపంలోని కల్వర్టుపై కూర్చొన్న చిరుతను సెల్‌ఫోన్‌లో బంధించి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. రెండు రోజులు క్రితం పత్యాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఈ చిరుత కనిపించినట్లుగా చెబుతున్నారు. అలాగే నాలుగు రోజుల క్రితం చిన్నేకుంటపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో చిరుతలను చూసినట్లు గొర్రెలు కాపరులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

ఏకాగ్రతతోనే లక్ష్య సాధన



రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

కూడేరు: ఏకాగ్రత ఉంటేనే రైఫిల్ షూటింగ్‌లో లక్ష్యాన్ని ఛేదించగలుగుతారని క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ సూచించారు. 28 ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో భాగంగా కూడేరు మండలం ఎన్‌సీసీనగర్‌లో గురువారం క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యం దండెత్తకుండా ఆర్మీ జవాన్లు ఎలా పోరాడుతారనే అంశంపై అవగాహన కల్పించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను క్యాంప్ కమాండర్ అభినందించారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెబ్బల మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పుట్టపర్తిలోని సాయిఆరామంలో గురువారం నిర్వహించిన కురుబ సంఘం జిల్లా సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ నెమలివరం ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, యువజన సంఘం అధ్యక్షుడు బుల్లె లింగప్రసాద్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు తగరకంట కృష్ణమూర్తి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మాధవప్ప, గోరంట్ల మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా మాధవప్ప, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, వరప్రసాద్, సురేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెన్నన్న, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, ట్రెజరర్‌గా జగదీష్, ప్రచార కార్యదర్శిగా నారాయస్వామిని ఎన్నుకున్నారు.

రేపటి నుంచి జూడో జట్ల ఎంపిక

ధర్మవరం రూరల్: ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిత్యం వహించే జిల్లా జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించనున్నట్లు ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ చిగిచెర్ల పాఠశాలలో సెలక్షన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహిళలు స్వశక్తితో రాణించాలి

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

హిందూపురం టౌన్: స్వయం ఉపాధిపై దృష్టి సారించి స్వశక్తితో రాణించాలని మహిళలకు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఉపాధి కల్పన ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఏడు రోజుల పాటు అందజేసే శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఏడు రోజుల శిక్షణ అనంతరం ఉపాధి కల్పనకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సజ్జ రొట్టి, మురుకులు, సమోసా, చెకోడి, బూందీ తదితర తినుబండారాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులతో మాట్లాడి రుణాలను ఇప్పించడమే కాక ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ డీపీఎం రామిరెడ్డి, డీపీఎం రామ్మోహన్, ఏపీఎం రామకృష్ణ, సీసీలు, ఎంఎస్‌ఓబీలు, ఉపాధి కల్పన ట్రస్ట్ సభ్యులు రషీద్, రఘునాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ నరసయ్య

ఈవీఎంల పరిశీలన పక్కాగా జరగాలి

పుట్టపర్తి అర్బన్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ పక్కాగా జరగాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకూడదని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం ధర్మవరం మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 వరకూ కొనసాగుతోందని జిల్లా నోడలాఫీసర్ శివారెడ్డి కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమానికి హాజరవుతున్న బెల్ ఇంజనీర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టికలను, నిర్దేశించిన అనెక్సర్లు 3, 5, 11, 12, 13, 14 లను అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఈవీఎంల పనితీరును, వాటి తనిఖీ వివరాలను కలెక్టర్ .. బెల్ ఇంజనీర్లతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యోగేశ్వరిదేవి, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలించి బయటకు వస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కేజీబీవీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

ధర్మవరం రూరల్: మండలంలోని మోటుమర్ల వద్ద ఉన్న కేజీబీవీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి గురువారం సందర్శించారు. అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాల సందర్భంగా విద్యార్థినిలకు అయోడిన్ వాడకంపై పోటీ పరీక్ష నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రోజూ తాజా ఆకుకూరలతో పాటు వంటకాల్లో అయోడిన్ కలిగిన ఉప్పు వినియోగించి భుజిస్తే చురుగ్గా ఉంటారన్నారు. పిల్లలకు వినికిడి సామర్థ్యం పెరుగుతుందన్నారు. గర్భిణుల్లో శిశువు ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు. థైరాయిడ్, గాయిటర్ వ్యాధుల్ని రాకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెలియా సాల్మన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.చెన్నారెడ్డి, డాక్టర్ పుష్పలత, కేజీబీవీ ప్రిన్సిపాల్ మీన, సీహెచ్‌ఓ కళావతి, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి

ఉల్లి.. వెల్లుల్లి.. తగ్గేదేలా!



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన ఉల్లి, వెల్లుల్లి

- అమాంతం పెరుగుతున్న ధరలు
- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.220
- పొరుగు రాష్ట్రాల్లో పంట నష్టాలే కారణమంటున్న వ్యాపారులు

హిందూపురం అర్బన్: ఉల్లి, వెల్లుల్లి ధరలు వినియోగదారులకు కంటతడి పెట్టిస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర పెరుగుతుండడం అటు సామాన్య ప్రజలకు సైతం పెను భారంగా మారింది. పది రోజుల క్రితం వరకూ ఉమ్మడి జిల్లా కిలో ఉల్లిపాయల ధర రూ.20 నుంచి 30 వరకు ఉండగా.. ప్రస్తుతం గ్రేడింగ్‌ను బట్టి రూ.55 నుంచి రూ.60కి చేరుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్థానికంగా లభ్యమయ్యే సరుకుతో పాటు ప్రతి నెలా ఇతర రాష్ట్రాల నుంచి 2,450 టన్నుల వరకూ ఉల్లిని దిగుమతి అవుతోంది.

మరింత పెరిగే అవకాశం..

ఉమ్మడి అనంతపురం జిల్లాకు మహారాష్ట్రలోని షోలాపూర్, కర్ణాటకలోని బళ్లారి, కర్నూలు నుంచి ఏటా రెండు దశల్లో ఉల్లి దిగుమతి అయ్యేది. ఈ సరఫరా ఏ మాత్రం ఆలస్యమైనా బెంగళూరు మార్కెట్ నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకునే వారు. ఈ ఏడాది కర్నూలు జిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లోనూ ఉల్లి పంట భారీగా దెబ్బతినింది. బళ్లారి ప్రాంతంలో చేతికి అందిన కొంత పంట సైతం ఆ ప్రాంత ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. ప్రస్తుతం కర్ణాటక, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉల్లి మాత్రమే మార్కెట్‌లో లభ్యమవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో రవాణా చార్జీల భారం గణనీయంగా పెరిగింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఉల్లి రూ.55 నుంచి రూ.60 వరకూ అమ్ముడు పోతోంది. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు. నవంబర్ చివరి నాటికి రూ.85 నుంచి రూ.90 వరకు ఉల్లి ధరలు చేరుకునే పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు.

ఉల్లి బాటలోనే వెల్లుల్లి..

ఉల్లి బాటలోనే వెల్లుల్లి కూడా నడుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వెల్లుల్లి కిలో రూ.200కు చేరింది. నెల రోజుల క్రితం రూ.100తో అమ్ముడు బోయిన వెల్లుల్లి ఉన్నఫళంగా రూ.120 పెరిగి రూ.220కు చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలవారీ ప్రజల అవసరాలకు 50 టన్నుల వెల్లుల్లి అవసరం కాగా, మార్కెట్‌లో సరుకు లేక డిమాండ్ నెలకొంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వెల్లుల్లిని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. మరో 20 రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగి కిలో రూ.250కు చేరుకునే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు.

ఉత్పత్తి తగ్గింది



మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పంట ఉత్పత్తి లేకపోవడంతో ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరిగాయి. ప్రస్తుతం 50 కిలోల ఉల్లి గడ్డల సంచి రూ.2,500 నుంచి రూ.2,600 వరకు ధర పలుకుతోంది. కొత్త పంట వచ్చే వరకూ ధర తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఏసీ గోదాముల్లో నిల్వ చేసిన సరుకు బయటకు వస్తోంది.

– గంగప్ప, కూరగాయల వ్యాపారి, హిందూపురం

కొనలేకపోతున్నాం



మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.60కి చేరుకుంది. ఇదేమని అడిగితే ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు. దీంతో కూరల్లో ఉల్లి, వెల్లుల్లి వాడకాన్ని బాగా తగ్గించాం. గతంలో ఉల్లిని ప్రభుత్వం సబ్సిడీ ధరపై అందజేసింది. ఈ సారి కూడా అలాగే అందజేస్తే బాగుంటుంది.

– ఫకృద్దీన్, వినియోగదారుడు, చిలమత్తూరు

యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

యాడికి: వివాహితను లోబర్చుకుని తన వెంట పిలుచుకెళ్లిన ఘటనలో ఓ యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన సతీష్ మాయ మాటలతో లోబర్చుకుని తన వెంట పిలుచుకెళ్లాడు. దీనిపై వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. తిరుపతిలో ఆమె ఆచూకీని గుర్తించి బుధవారం అక్కడకెళ్లి పిలుచుకొచ్చారు. విచారణ అనంతరం గురువారం వివాహితను భర్తకు అప్పగించి, ఆమె ఫిర్యాదు మేరకు సతీష్‌పై కేసు నమోదు చేశారు. అజ్ఞాతంలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి దుర్మరణం



వీరనారప్ప (ఫైల్)

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని గుట్టకిందపల్లికి చెందిన వీరనారప్ప (26)కు భార్య శశికళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం గరుడంపల్లి సమీపంలో మరమ్మతుకు లోనైన ద్విచక్ర వాహనాన్ని సరిచేసేందుకు వెళ్లాడు. పని ముగించుకుని తన స్నేహితుడు, రాప్తాడు మండలం చాపట్లకు చెందిన జగదీష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై ధర్మవరానికి బయలుదేరాడు. బడన్నపల్లి సమీపంలోకి చేరుకోగానే మలుపు వద్ద వాహన వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో వీరనారప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు

- జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి తెలిపారు. గుంతకల్లు రైల్వే సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై సంబంధిత అధికారులతో గురువారం తన చాంబర్‌లో ఆమె సమీక్షించారు. గతంలో జరిగిన నేరాల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. ఆయా కేసుల్లో అరెస్ట్ అయిన నేరస్తుల వివరాలు, స్వాధీనం చేసుకున్న సొత్తు, డిటెక్షన్ కానీ కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీలు, సీఐలతో చర్చించారు. ప్రయాణికులకు గట్టి భద్రత కల్పించాలని ఆదేశించారు. రాత్రి పూట నేరాల నియంత్రణకు గస్తీ పెంచాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. రైళ్ల ద్వారా గంజాయి, సారా, మద్యం తదితర రవాణాను అరికట్టాలన్నారు. ఈ అంశంలో ఆర్‌పీఎఫ్, ఎస్ఈబీ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కనుల పండువగా రంగనాథుడి జాతర





ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న రంగనాథ స్వామి మూలవిరాట్, ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేస్తున్న దృశ్యం

అగళి: మండలంలోని నరసంబూదిలో వెలసిన రంగనాథస్వామి జాతర గురువారం కనుల పండువగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తూ వస్తున్న ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకుజామునే స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. వెండి ఆభరణాలతో పాటు భక్తులు అందజేసిన వివిధ రకాల పూలతో అలంకరించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని రథంపై అధిష్టింపజేసి, గోవింద నామస్మరణతో భక్తులు లాగారు.